క్లుప్తంగా

అన్నప్రసాదం వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సేవా సంఘం సహకారంతో అన్నప్రసాద సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు, రెడ్డి సేవా సంఘం ఉపాధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, లింగారెడ్డి, రెడ్డి సేవా సంఘం సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, కాశీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సమితి సభ్యురాలుగా విజయమ్మ



బద్వేలు అర్బన్ : ఇటీవల బద్వేలులో ముగిసిన సీపీఐ జిల్లా మహాసభల్లో బద్వేలుకు చెందిన మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి బి.విజయమ్మను సీపీఐ జిల్లా సమితి సభ్యురాలుగా ఎన్నుకున్నట్లు ఆమె సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. మహిళల సమస్యలపై ముందుండి పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి బాలఓబయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

సీబీఐటీలో అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న రీసోర్స్ పర్సన్

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో సోమవారం ఎంబెడెడ్ సిస్టమ్స్, ఫండమెంటల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసీఈ విభాగం, ఈఎస్‌టీఈ స్టూడెంట్స్ చాప్టర్ సంయుక్తంగా ఎంబెడెడ్, ఫండమెంటల్స్‌పై ఇంటర్నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌గా యూఎస్‌ఏ నుంచి వచ్చిన జానకీరామన్ హాజరయ్యారు. ఫండమెంటల్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్ ఆవశ్యకతను వివరించారు. ఇదే క్రమంలో విద్యార్థులు చదువు అనంతరం చేపట్టాల్సిన చర్యలు, ఉద్యోగ సాధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి. శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎస్.శృతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

ప్రొద్దుటూరు రూరల్ : రీ సర్వే జరిగిన ఏడు రెవెన్యూ గ్రామాల్లో ఉన్న జాయింట్ ఎల్‌పీఎం భూ సమస్యలను సంబంధిత రైతులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించి పరిష్కరించుకోవాలని మండల వ్యవసాయాధికారి వరహరికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని సర్వీరెడ్డిపల్లె, కల్లూరు, ఎర్రగుంట్లపల్లె, ఉప్పరపల్లె, కామనూరు, దొరసానిపల్లె, చౌడూరు గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, ఈ గ్రామాల పరిధిలో కొన్ని సర్వే నంబర్లు పలు కారణాలతో రెవెన్యూ అధికారులు జాయింట్ ఎల్‌పీఎంలో ఉంచారని ఆయన వివరించారు. దీని ద్వారా పంట నమోదు చేసేందుకు వీలు కావడం లేదని తెలిపారు. పంట నమోదు కాకపోతే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు రాకపోవడంతోపాటు ఇన్సూరెన్స్ అందదని పేర్కొన్నారు. రీ సర్వేలో ఎటువంటి సమస్యలు లేకుండా వేర్వేరు ఎల్‌పీఎం నంబర్లు ఆన్‌లైన్‌లో నమోదైన రైతుల పొలాల్లో పంటల నమోదు కార్యక్రమం సజావుగా సాగుతుందని తెలిపారు. జాయింట్ ఎల్‌పీఎం ఉన్న రైతులు చలానాలను కట్టి సంబంధిత వీఆర్‌ఓల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

నిత్యాన్నదానానికి భక్తులు సహకరించాలి



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు

చాపాడు : అల్లాడుపల్లె వీరభద్రస్వామి సన్నిధిలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమ అభివృద్ధికి భక్తులు సహకరించాలని ఆలయ వీరభద్రస్వామి దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ పేర్కొన్నారు. నాగుల చవితి పండుగ పురస్కరించుకుని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఉత్సవ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి స్వామి వారి భక్తులు సహకరించాలన్నారు. ప్రతి సోమవారం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



పుట్టవీధిలో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు



క్యూలో వేచి ఉన్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : నాగుల చవితి పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాలలోని నాగదేవతా విగ్రహాల వద్ద, పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే పుట్టవీధిలోని పుట్టవద్ద, అగస్త్యేశ్వరస్వామి, రామేశ్వరం, రాజరాజేశ్వరి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయాలలోని నాగదేవతా విగ్రహాల వద్ద పాలు పోసేందుకు భక్తులు బారులు తీరారు. చలివిడి, నువ్వుల పిండి నైవేద్యంగా సమర్పించి కొబ్బరికాయలు కొట్టి చీరలు సమర్పించి పుట్టలు, నాగదేవతా విగ్రహాల చుట్టూ భక్తులు ప్రదక్షణలు చేశారు. రక్షాధారాన్ని కట్టుకుని తమను కాపాడమని నాగదేవతను వేడుకున్నారు. కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న పుట్టతో పాటు పలు ప్రాంతాలలోని పుట్టల వద్ద భక్తులు నాగదేవతను పూజించేందుకు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నాగులచవితి పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే స్నానాలు చేసి పుట్ట చుట్టూ తిరిగి ఒక్కపొద్దు ఉన్నట్టు చెప్పి వస్తారు. ఆ తర్వాత మళ్లీ వెళ్లి పుట్టలో నువ్వులు, చలువ పిండి, బెల్లం, పసుపు దారం, పాలతో ప్రత్యేకంగా పూజించారు. నాగులచవితి రోజు పుట్టకు ఉపవాసం ఉండటం వల్ల నాగ, సకల దోషాలు తొలగి, కోరుకున్న కోర్కెలు నెరవేరతాయని భక్తుల విశ్వాసం. ఉపవాసం ఉన్నవారు మరుసటిరోజు ఉదయం పుట్టకు పాలు పోసి ఉపవాస దీక్షను విరమించనున్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా ప్రధాన కార్యదర్శి పూసల చిన్న ఓబన్న తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ గంయ్యకు ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 1217ను రద్దు చేసి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 46వేల క్లెయిమ్‌లను పరిష్కరించి నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సంబంధం లేకుండా 1996 చట్టం అమలు చేసి 12 రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికులకు కొత్త గుర్తింపు కార్డులు ఇచ్చి పాత కార్డులను రెన్యువల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు సాంబయ్య, వెంకటకృష్ణ, ప్రసాద్ రావు, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి



సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

మైదుకూరు : కౌలు రైతులకు ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులను జారీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు మైదుకూరులో కౌలు రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలని కోరుతూ సోమవారం వార్డు సచివాలయాల ఎదుట వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ పెట్టకపోవడం శోచనీయమన్నారు. గుర్తింపు కార్డు లేకుంటే పంట రుణాలు, పంటల బీమా పథకం వర్తించవని, పంట నమోదుకు కూడా అవకాశం ఉండదన్నారు. భవిష్యత్తులో ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకం అందుతుందన్న గ్యారెంటీ లేదన్నారు. అందువల్ల వెంటనే ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని వాసవినగర్ సచివాలయం కార్యదర్శి మధు డేవిడ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శ్రీరాములు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎస్.షావలీ, కౌలు రైతుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి, సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, దువ్వూరు మండల కార్యదర్శి రవి, ఖాజీపేట మండల కార్యదర్శి లక్ష్మయ్య, పీరయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు యూరియా పంపిణీ

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె రైతు సేవాకేంద్రంలో మంగళవారం ఉదయం 10 గంటలకు యూరియా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని రావాలన్నారు. అదేవిధంగా పంటల బీమా, ఈ-పంట గురించి రైతులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్-కో జేఈ నరేంద్రారెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయడం జరుగుతుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని జేఈ కోరారు.

నేడు మండల సమావేశం

ఖాజీపేట : మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారంఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివిజా సంపతి తెలిపారు. ఖాజీపేట మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు సమావేశానికి హాజరుకావాలని తెలియజేశారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను తీసుకురావాలని సూచించారు.

రేపు కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరపోగురవి

బద్వేలు అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగురవి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ సమస్యలను గాలికొదిలేసిందన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి బకాయిలు రూ.6400 కోట్లు బకాయిలు ఉంచి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడుగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా సుశాంత్, ఉపాధ్యక్షులుగా సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, పవన్, చరణ్, సహాయ కార్యదర్శులుగా రామకృష్ణ, సూర్య, గోవర్దన్, సురేష్, పట్టణ కమిటీ సభ్యులుగా మరికొంత మందిని ఎన్నుకున్నారు.

నేడు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం రిజిస్ట్రేషన్

ప్రొద్దుటూరు : ఏపీ సీడ్యాప్ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, స్వయం ఉపధి కల్పన కోసం మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ వెలుగు కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు ఏపీఎం వెంకటసుబ్బమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సీడ్యాప్ క్యూఆర్ కోడ్ రిజిస్ట్రేషన్ క్యాంప్‌కు 18 నుంచి 45 ఏళ్లలోపు ఉన్న వారు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకుని శిక్షణ, ఉపాధి అవకాశాలు పొందాలని ఆమె సూచించారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె రెవెన్యూ పొలం సర్వే నంబర్ 217తో మొదలైన సర్వే నంబర్లలో ఉన్న వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వ అధికారులు గత వారం రోజుల క్రితం స్వాధీనం చేసుకున్నారు. ఆ భూములను పేదలకు పంచి పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, సీపీఎం మండల కార్యదర్శి పోలయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సావిశెట్టిపల్లె, ఆకులనారాయణపల్లె, వరికుంట్ల గ్రామాల్లోని పేదలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములను పేదలకు పంచాలని తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్‌కు వినతి పత్రం అందజేశారు.

ముగిసిన విశ్వబ్రాహ్మణ చైతన్య యాత్ర



వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

బ్రహ్మంగారిమఠం : విశ్వబ్రాహ్మణ సాంస్కృతిక చైతన్య యాత్ర ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ప్రారంభమై 22 రోజుల పాటు సాగి బ్రహ్మంగారిమఠం చేరుకుంది. 450 కిలోమీటర్ల పాటు సాగిన పాదయాత్ర శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలోని ఆంధ్ర, కర్ణాటక సత్రంలో సోమవారం జరిగిన ముగింపు సభతో పూర్తయింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర తొలి సభాపతి, ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షులు బంగారు బాబు, హైదరాబాద్ క్రైమ్ బ్రాంచ్ ఏసీపీ కేఎం కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ ఈశ్వరిదేవి మఠం పీఠాధిపతులు వీరశివకుమారస్వామి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల పంచవృత్తులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని, వాటిని ఆధునీకరించి కాపాడుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. ఏసీపీ కేఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ విశ్వనాథుల పుష్పగిరి సామాజిక స్పృహ కలిగిన రచయిత, క్రియాశీల విశ్వకర్మ కార్యకర్తగా దశాబ్దకాలంగా విస్తృతంగా పలు రాష్ట్రాల్లో పని చేస్తున్నాడని పేర్కొన్నారు. దేశవ్యాప్త విశ్వకర్మ ఉద్యమాన్ని నిర్మించేందుకు పెద్ద ఎత్తున కార్యాచరణ రూపొందిస్తూ అందులో భాగంగానే ఈ తొలి విడత పాద యాత్ర చేపట్టారని తెలిపారు. సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో సాగిన ఈ పాదయాత్ర విశ్వబ్రాహ్మణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఐక్య ఉద్యమాల్ని నిర్మించేందుకు ఇది తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కంజర్ల కృష్ణమూర్తి, సాల్లేటి ప్రభాకరాచారి, బాల నరసింహాచారి, రంజిత్ గుగ్గిళ్ళ సతీష్, రాజశేఖర్ ఆచారి, ప్రతాపచారి, ఇడుకోజు నరేష్, పోలోజు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మురికి నీటి సమస్య పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక 16వ వార్డు మోడంపల్లె ఎస్సీ కాలనీలో మురికి నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి యల్లయ్య మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో కాలనీ వాసులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డుపై మురికి నీరు నిలబడి ఉండటం వల్ల నరసింహాస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ఆ మురికి నీటిలో నడుచుకుని వెళ్లాల్సి వస్తోందన్నారు. సంవత్సరాల తరబడి ఈ సమస్యను పరిష్కరించడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు మురికి కాలువ నిర్మాణం చేపట్టి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఎస్ నాయకురాలు లక్ష్మీదేవి, రాష్ట్ర మాలహానాడు జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ నాయకురాలు చెన్నమ్మ, ఏసుదాసు, బాలాజీ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో సోమవారం ఓ యువత మేలుకో పోలీసు కళాజాగృతి బృందం ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వివిధ మత్తు పదార్థాలకు అలవాటుపడి శారీకంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులు చెడువైపు వెళ్లకూడదని, క్రమశిక్షణతో మెలగాలని, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎస్ఐ వెంకటరెడ్డి శక్తి యాప్ మహిళలకు రక్షణగా ఉంటుందని, యాప్ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కళాజాగృతి బృందం మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలను నాటకం, నృత్యం, పాటల ద్వారా అవగాహన కల్పించారు. కళాజాగృతి బృందం ఎస్ఐ సుబ్రహ్మణ్యం, టీం లీడర్ హెడ్‌కానిస్టేబుల్ నరసయ్య, శ్రీవిద్య జూనియర్ కళాశాల డైరెక్టర్ రామమోహన్, కరస్పాండెంట్ సురేష్‌బాబు రెడ్డి, కళాజాగృతి టీం కరుణాకర్, ఉదయ్, మహేష్ బాబు, సుశీల, మధు, శ్రీరాం పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలి

పోరుమామిళ్ల : ఎలాంటి ఎరువులైనా ఎమ్మార్పీ ధరకే ఇవ్వాలని, ఎరువులు అందుబాటులో ఉంచుకొని రైతు అడిగిన ఎరువులు మాత్రమే ఇవ్వాలని వ్యవసాయ సహాయ సంచాలకులు యం. మురళీధర్‌రెడ్డి చెప్పారు. సోమవారం మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డితో కలసి ఆయన ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ఎరువుల కృత్రిమ కొరత సృష్టించరాదని హెచ్చరించారు. షాపులో స్టాక్ వివరాలు ఖచ్చితంగా ప్రదర్శించాలని, స్టాక్ వివరాలు 15 రోజులకు ఒకసారి సమర్పించాలన్నారు. రికార్డ్స్ సక్రమంగా నిర్వహించాలన్నారు. అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉంచాలని వారు తెలిపారు. రికార్డులు లేనిచో చట్టపరమైన చర్య తీసుకుంటామన్నారు.

పగటి కలలు మాని ప్రజా సంక్షేమానికి పాటుపడండి

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



బద్వేలు అర్బన్ : కూటమి నేతలు పగటి కలలు కనడం మానుకుని ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. ఓ పత్రికలో జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి 'బద్వేలుకు ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉంది' అని మాట్లాడిన విషయమై ఆమె స్పందిస్తూ సోమవారం ఎన్‌జీవో కాలనీలోని ఆమె నివాసంలో మాట్లాడుతూ జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న ఆదినారాయణరెడ్డి దర్యాప్తులో ఉన్న లిక్కర్ కేసు విషయమై తమ పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డిని అరెస్టు చేస్తారని చెప్పడం సరికాదన్నారు. కేసు దర్యాప్తులో ఉండగా అప్పుడే అరెస్టు చేసినట్లు, తామంతా రాజీనామా చేసినట్లు, ఉప ఎన్నిక వచ్చేసినట్లు ఊహించుకుని బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కడపలో జరిగిన ఆ పార్టీ నేతల సమావేశంలో ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ఏ ఎన్నిక జరిగినా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సారథ్యంలో బద్వేలు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కంచుకోటగా ఉంటుందనే విషయాన్ని ఆదినారాయణరెడ్డి గుర్తించాలని హితవు పలికారు. అలాగే కష్టనష్టాల్లో పార్టీ తీసుకునే ప్రతి నిర్ణయానికి కట్టుబడి జగనన్న వెంటే నడుస్తామని తెలిపారు.

హామీల అమలుకు ఇంకెంతకాలం?



పెద్దకామసముద్రంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్లూరు : పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఇంకెనాళ్లు కాలయాపన చేస్తారని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాలప్రభాకర్‌రెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముడమాలబాలమునిరెడ్డి ప్రశ్నించారు. మండల పరిధిలోని కామసముద్రం పంచాయతీలోని పెద్దకామసముద్రం, చిన్నకామసముద్రం, ఎస్సీకాలనీ, ఎస్టీకాలనీలలో సోమవారం బాబు షూరిటీ – మోసం గ్యారెంటీపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఏ ఒక్క పథకం కూడా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందించలేని పరిస్థితి అని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే కరోనా మహమ్మారి విలయ తాండవం చేసినా ఇచ్చిన హామీలను ఠంఛన్‌గా లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలుపుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రాజవోలు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పొన్నవోలుబ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ ఆర్.వి.సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరెడ్డి, శివచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటా కూటమి పాలనపై వ్యతిరేకత



సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు : కూటమి పాలనపై ప్రతి ఇంటా వ్యతిరేకత కనిపిస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నా చంద్రబాబు మాత్రం వాటి ఊసే ఎత్తడం లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.సుదర్శన్, నాయకులు అంకన గురివిరెడ్డి, సుధ రామకృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణపల్లెలో బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఏమేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పింఛన్, తల్లికి వందనం కొందరికే తప్ప ఏ పథకం అందడం లేదని మహిళలు వారికి తెలిపారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకే పింఛన్, ఫ్రీ బస్సు, విద్యార్థులకు వసతి దీవెన, విద్యాదీవెన పథకాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఏపీ భాస్కర్‌రెడ్డి, జె.సింగరయ్య, పులివీరారెడ్డి, అంకిరెడ్డి, థామస్ తదితరులు పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కరువు భత్యం, 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నుంచి 2025 జూలై వరకు నాలుగు విడతల కరువు భత్యం ప్రకటించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మూడు విడతల కరువు భత్యం ఇప్పటికే ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఒక్క డీఏ కూడా ప్రకటించలేదన్నారు. 2023 జూలై నుంచి 12వ పీఆర్సీ అమలులోకి రావాల్సి ఉండగా ఇంత వరకు 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించకపోవడం అన్యాయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన 11వ పీఆర్సీ బకాయిలను, కరువు భత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు, జిల్లా కౌన్సిలర్లు సుబ్బారెడ్డి, కృష్ణయ్య, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ అనిత

ప్రొద్దుటూరు రూరల్ : ఎమ్మార్పీకే రైతులకు ఎరువులను విక్రయించాలని వ్యవసాయశాఖ ఏడీఏ అనిత తెలిపారు. పట్టణంలోని మహాలక్ష్మి ఎరువుల దుకాణాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి 119.28 మెట్రిక్ టన్నులు యూరియా ఎరువులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో భాగంగా 25.8 మెట్రిక్ టన్నుల యూరియా మండలంలోని రైతు సేవా కేంద్రాలకు పంపిణీ చేశామన్నారు. జమ్మలమడుగు మండలానికి 49.5 మెట్రిక్ టన్నులు, పెద్దముడియం మండలానికి 29.7 మెట్రిక్ టన్నులు, మైలవరం మండలానికి 19.8 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామన్నారు. ఇంకా రావాల్సిన యూరియా త్వరలో ఆయా మండలాలకు సరఫరా అవుతుందన్నారు. రైతులు తొందరపడి ఎక్కువగా యూరియా కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోకూడదన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాల యజమానులు రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించినా, బిల్లులు ఇవ్వకపోయినా రైతులు తనను సంప్రదించడం కానీ, ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ వరహరికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు చేరాలి

కలసపాడు : విద్యార్థినులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఎంఈఓ మస్తాన్ వలి తెలిపారు. మండలంలోని పెండ్లిమర్రి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మై వాయిస్ కార్యక్రమం నిర్వహించారు. ఉపన్యాస పోటీల్లో తరగతి స్థాయిలో 10వ తరగతి విద్యార్థిని సవిత, 9వ తరగతి విద్యార్థిని గౌతమి ప్రతిభకనబరిచారు. వీరిని ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో హరిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఫణి రాజ్ కుమార్, మై వాయిస్ ప్రోగ్రాం డైరెక్టర్ విజయలక్ష్మి, కలసపాడు, కాశినాయన మండలాల మై వాయిస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పరిమళ జ్యోతి, ఉపాధ్యాయులు సరోజ, ప్రభావతి, వాణి పాల్గొన్నారు.

• రాజోలికి జలకళ



రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న నీరు



వెల్లాల పాతవంతెనను తాకుతూ పోతున్న వరద నీరు

రాజుపాళెం మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు నీరు భారీగా వస్తోంది. దీంతో రాజోలి ఆనకట్ట నీటితో జలకళ సంతరించుకుంది. సోమవారం వరదనీరు ఎక్కువగా రావడంతో వెల్లాల సమీపంలోని పాతవంతెనను తాకుతూ నీరు పారుతోంది. ప్రస్తుతం రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 13308 క్యూసెక్కులు, ప్రధాన కాలువకు 258, కేసీ చాపాడు కాలువకు 50 క్యూసెక్కులు నీరు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. – రాజుపాళెం